# శుద్ధ అబద్ధం

అవాళ, మిట్టమధ్యాహ్నం, ఉన్నట్టుండి కారు కమ్ము కొచ్చింది. అప్పటినుంచీ, కుండపోతగా వాన ఎడా తెరిపీ లేకుండా పడుతూంది.

ఆ పూట రోజాకన్న పెందరాళే ప్రొద్దుగూకింది. వణుకు పుట్టినట్లు, చీకటి తెరలు తెరలుగా ముంచుకొచ్చి, పొడుచుకున్నా కన్ను కనపడకుండా గుయ్యారంగా ఉంది.

పోరగాడి కడుపు ఏడుస్తూంది. ఈదురుకొట్టి అవు ఎగచేపింది. పొయ్యి అంటించి బువ్వవండుదామంటే చుట్టూ గుడిసె గాలికి ఉండుండి అదిరిపడుతూ, ఎప్పుడు ఎగిరిపోతుందా అన్నట్టు వుంది.

మక్కెలి బిగదీసుకుపోయి - అవు, చెట్టు క్రింద మూలుగుతూంది. చంటివాడు ఎక్కిళ్ళు వచ్చేవరకూ గుక్క పట్టి, సొమ్మసిల్లి, మ్రాగన్నుగా తల్లి ఒళ్ళో పడివున్నాడు. సుబ్బడు కంట్లో వత్తులు వేసుకుని కొంగజపంచేస్తూ కూచున్నాడు.

వాడికి ఆకలివేసింది. పిల్లవాడి బొజ్జ తడిమిచూశాడు. రత్తి నవ్వింది. "పోవే!" అన్నట్టుచూసి - కట్టులోంచి ఓ చొప్పదంటు లాగి, నమలడం మొదలు పెట్టాడు.

పిల్లవాడు మసిలాడు: రత్తి వాడిని రొమ్ముకు ఒత్తుకుని, కాసిని నూకలు కచ్చాపచ్చాగా నమిలి పిల్లవాడినోటికి పట్టింది.

వాళ్ళు కూచున్న మేరా, తాటాకులు యెగిరిపోయినాయి: జల్లు పడేసి మొగంమీదికి కొట్టింది. కొంప అంటుకున్నంత మెరుపు మెరిసింది. కరణం గారింట్లో, బిందెలూ, తప్పాలాలూ, అటకమీదనుంచి పడ్డట్టు - ఉరుము ఉరిమింది. ఆవు - అంభా అంది. కట్టుతాడు వదులై, తడికి, భార్లాగా లోపలికి గుద్దుకుంది.

తడికకు కుంది అడ్డం వేద్దామని సుబ్బడు లేచాడు. గుర్రూగుర్రూమంటూ మట్టిరోడ్డుమీద చప్పుడు దొర్లు కుంటూ వచ్చింది. "ఎవరురా లోపల" అని పొల్లు కేక వినపడ్డది.

సుబ్బడు బయటికి తొంగి చూశాడు. ఎవరో ఓ కుదిమట్టం - కారు నెట్టుకుంటూ వచ్చారు: ఓ మీసాల ఆసామి, మీసాలతడి దులుపుకుంటూ ముందుకు ఓ అడుగువేసి "ఎవరది?" అన్నాడు

ఒత్తుగా చినుకు పడుతూంది కాని, జల్లు వెలిసింది. సుబ్బడు బయటికి వచ్చి "ఎం అయ్యా!" అన్నాడు.

"ఆ గొడ్డును విప్పేయి - కారు పెట్టాలి" అన్నాడు ఆసామి.

"దానికి నిలవ తావులేదయ్యా! తడిసి తడిసి వుంది. మెరాబాలో విడిస్తే దొమ్మ కొట్టిపోతుంది" అన్నాడు సుబ్బడు.

"అంతగాపోతే మరోటి కొనిపెడతాలే – పదివేల రూపాయలకారు పాడైపోతుంది. విప్పేయ్..." అని గదమాయించాడు ఆసామి. సుబ్బడు చిత్తమన్నాడు కిక్కురు మనకుండా.

కారులోంచి అబ్బాయిగారు "డాడీ" అని పిలిచాడు. "ఎస్‌బాబ్" అని ఆసామి దగ్గరకు వెళ్ళాడు.

"అది "కౌ" కాదూ!"

"ఎస్ బాబ్."

"వండర్‌ఫుల్ "కౌ". మిల్క్ యిస్తుంది కాదూ?"

"ఎస్ డియర్!" అన్నది పక్కనుకూచున్న అబ్బాయి అమ్మ.

"హౌనైస్:– మమ్మీ నాకు మిల్క్ కావాలి."

"అలాగే బాబ్!" అని తలనిమిరి "డాలింగ్" అని నాథుణ్ణి కేక వేసింది. ఆసామి సుబ్బణ్ణి కేక వేశాడు.

"మా అబ్బాయిగారికి పాలు కావాలి."

"లేవు బాబూ."

"పితుకు."

"ఇవ్వదు బాబూ, మా పిల్లగాడికే లేవు."

"నీ పిల్లగాడికి లేకపోతే మా బాబుకి లేవంటావా? వేషాలుపోక – కావాలంటే ఓ పావలాయిస్తా – పితుకు."

"డాలింగ్, డాలింగ్! పావలా టూమచ్! టు అనాస్, ఓన్లీ టు అనాస్–" అంటూ విలవిలలాడుతూంది ఆసామి భార్య.

"అమ్మగారూ, టు అనాస్ యిచ్చినా, టు రుపీస్ ఇచ్చినా అది పుచ్చుకోదమ్మా! అది డబ్బేం చేసుకుంటుంది తల్లీ, తవురికి ఎరిక లేదేమో కాని, కులంవున్న ఏ గొడ్డూ ఏదీ కాని వేళ – చేపదు" అంటూ సుబ్బడు కారు దగ్గిరకు వెళ్ళాడు. ఆసామి భార్యకు, కడుపులో తిప్పినంత పనై – ముక్కు చిట్లించుకుంది. ఆసామి, సుబ్బడిగాలి కారుకు సోకకుండా, అడ్డం నుంచున్నాడు.

"అలా దుంగలా నిలుచుంటాడే – కారు చెట్టుక్రిందకు నెట్టమను డాలింగ్!" అని కోకిలకంఠంతో హెచ్చరించింది ఆ యమ్మ. మోటారు కారు చెట్టు క్రిందకు చేరింది.

మళ్ళీ గాలి – సాగింది. ఒక్క విసురుకు మండ విరిగి కారుమీద పడ్డది. లోపల కోకిల కంఠం కెవ్వుమన్నది, బాబ్! యింగ్లీషులో నేచర్‌ను ధారాళంగా తిడుతున్నాడు.

అబ్బాయీ, అమ్మగారూ – కారుదిగి, గుడిసెలోపలికి వచ్చారు. డ్రైవరు తినుబండారాల పెట్టె లోపలికి జేర వేశాడు.

రత్తి–వచ్చినవాళ్ళను చూసి పిల్లవాణ్ణి భుజాన వేసుకుని నిలుచుంది. అమ్మగారు రత్తి వంక చూసి – ముక్కు మరింత చిట్లించుకుంది.

ఆసామీ – కోటుతీసి, నేలమీద పరిచాడు. అమ్మగారూ, బాబూ గునుస్తూ కూర్చున్నారు. బాబ్ బిస్కత్తుల పొట్లం చించాడు. అమ్మగారు ఫ్లాస్కు మూత సుతారంగా తిప్పుతూంది.

బాబ్ బిస్కట్లు తింటున్నాడు. రత్తి చేతికి పిల్లవాడి బొజ్జ గుర్తుకొచ్చింది. "అమ్మగారూ!" అంది. "మాపిల్ల గాడికి ఓ రెండు ముక్కలు పడేయ్యండి" అంది. అనీ అనడంతో చెంప ఛెళ్ళుమంది. సుబ్బడు – మరోసారి చేయెత్తి "శుద్ధీ బుద్ధీ ఉండక్కర్లా. అవి దొరలు తినేవి. అలాంటి మా రాజులు తినేవి..." అని ఉరిమాడు.

"మీరు కొంచెంసేపు బయటికి వెళ్ళండి..." అన్నది అమ్మగారు. సుబ్బడు సకుటుంబంగా, బయటికి నడిచాడు. "తలుపు దగ్గరేసిపో! మా డ్రైవర్ని – ఇలా రమ్మను" అన్నాడు ఆసామి. డ్రైవర్ని లోపలికిజేర్చి తలుపు తడికి గట్టిగా కట్టేశాడు సుబ్బడు.

ఉన్నట్టుండి, మళ్ళీ జల్లు ముంచుకొచ్చింది – గుడిసె ఎగిరిపోయేట్టుగా గాలి కొడుతూంది. సుబ్బడు – కారు, చెట్టు క్రిందనుంచి అరబయటకు నెట్టి, గోవును పాడిచోట కట్టేసి, సకుటుంబంగా కారులో ఎక్కి తలుపులు వేసుకున్నాడు.

గాలి ఎక్కువైంది. గుడిసె చిందులు వేస్తూంది. ఎప్పుడు కూలుతుందో? – తడికె లాగిచూస్తే – రావడం లేదు. తాడు కోసేందుకు కత్తిలేదు. డ్రైవర్ని తాడు కొరకమన్నాడు ఆసామి. కాని డ్రైవరుది బోసినోరు, అయ్యగారు కొరుకుతూ కూర్చున్నాడు.

బయట వాన కొడుతూంది. కారులో మహా వెచ్చగా ఉంది. ఒకళ్ళ దగ్గిరగా ఒకరు జరిగి కూర్చున్నారు. మరింత వెచ్చగావుంది. అలాగే తెల్లారింది. తెల్లారుతూండగానే వాన వెలిసింది.

సుబ్బడు – ఇక బయటపడదామని తలుపు నెట్టాడు. ఉహూం... రాందే! గడియ తీయడం తిరకాసు వాడికి తెలియదాయెను...

పెదవులన్నీ పగిలి, చిగుళ్ళరక్తం చిమ్ముతూంటే – ఆసామీ – సుకుటుంబముగా తాడు నమిలి తడికెవిప్పిన – అనంతరం బయటకి వచ్చాడు. ఒక్క ఉరుకున ఆ కుటుంబం కారుదగ్గిరకు వచ్చిపడ్డది, తలుపు తీసింది. లోపల సుబ్బడి కుటుంబం ఆదమరచి నిద్రపోతూంది.

బయటవాళ్ళ అరుపులకీ, పెడబొబ్బలికీ – లోపలివాళ్ళు లేచి – కారు దిగారు. "తవురి ధర్మమా అంటూ పాడిచోట నిదురోయినాం, అయ్యా!" అంటూ సుబ్బడు వినయంగా కళ్ళు నులుముకున్నాడు. పిల్లవాడు మెలకువవచ్చి – ఆవులించాడు.

"డ్రైవర్! తలుపులు ఎందుకు లాక్ చెయ్యలా?"

"లేదుసార్!"

"నిన్ను డిస్మిస్ చేశాను."

"రైట్సార్, నాకు ఈ నెల జీతం – రూల్సు ప్రకారం మూడు నెలల బోనస్ ఇప్పించండి సార్."

"ఇంటికి రా. – చెక్ బుక్ తేలేదు."

"రైటోసార్, నాకు సొమ్ము ముట్టేవరకూ, అమ్మగారి నగ ఏదన్నా యిప్పించండి. లేకపోతే డిస్మిస్ ఆర్డరు చెల్లదు."

రత్తి, సుబ్బడూ చోద్యంగా ఈ మాటలు ఆలకిస్తున్నారు.

"ఏమా తలపొగరు. నీకు దిక్కున్న చోట చెప్పకోపో - ఒక్క కానీ యివ్వను--"

డ్రైవరు వెళుతున్నాడు.

"ఏయ్ డ్రైవర్!"

"సార్!"

"కారు తాళాలు ఏవీ!"

"అడగడం న్యాయమా సార్, - డబ్బు యిప్పించండి."

"డ్రైవర్ మమల్ని అధ్వాన్నపు అడవిలో ఇలా యిబ్బంది పెడతావా?" అమ్మగారు కళ్ళనీళ్ళ పర్యంతం అయింది.

"ఇయ్యి బాబూ వారిసొమ్ము వారికియ్యి..." అన్నాడు సుబ్బడు.

"మరి, నా రెక్కల కష్టం -?" అన్నాడు డ్రైవరు -

"ఎక్కడికీ పోదు. కారుకొనుక్కున్న సామంతులు - నీ జీతం డబ్బులు ఎగేస్తారా - యివ్వవయ్యా! - ఆతల్లి అడిగినందుకే యివ్వచ్చు -" అని బ్రతిమాలాడు సుబ్బడు. డ్రైవరు - యిచ్చేశాడు.

"మావంటి వారి దగ్గర యిన్నాళ్ళూ నౌకరీచేసి - చివరకు చెట్టు క్రింద బ్రతికేవాళ్ళచేత చెప్పించుకునే గతి పట్టిందానీకు!-"

"బుద్ధులిలా ఉండబట్టే-మీకు పూటకు గతి ఉండదు-"

--అయ్యగారూ; అమ్మగారూ ఏకగ్రీవంగా తిట్టి కారు కదిల్చారు-

"ఇదిగో - ఒరేయ్-!" అని ఆసామి సుబ్బణ్ణి కేక వేసి - ఒక బేడ అమ్మగారు అందివ్వగా - సుబ్బడిమీదికి గిరవాటు వేశారు -

సుబ్బడు - నేల పడ్డది - తీసి కళ్ళకు అద్దుకుని -

"ఆహాఁ - ఏం మనుష్యులయ్యా!" అన్నాడు డ్రైవరుతో -

కారు, - ధూకుడుగా నాలుగు బారలుసాగి - ఆగింది. బాబు - "డ్రైవర్! - డ్రైవర్" - అని పొల్లు కేకలు పెడుతున్నాడు.

డ్రైవరు - సుబ్బడివంక చూసి నవ్వాడు - "మాఅయ్యగారికి అర్భాటమే కాని, కారు తోలలేరు -"

"అన్నా! - అన్నా! - నీకు పున్నెముంటుంది - పెద్దవారి బుద్ధులు ఎసుమంటి వైతేనేం - లోన పోరగాడున్నాడు- తిన్నగా - తోలుకు పో - అన్నా! -" అని రత్తి బ్రతిమాలింది. డ్రైవరు - తల్లి మందలించిన పిల్లవాడిలాగా - తలవంచుకు ముందుకు సాగాడు.

"ఒక్క క్షణం కారు నిలుపన్నా - మా మనిషి చేత పాలుతీసి అంపుతా - ఆకలి పడుంటాడు - పిల్లగాడు -

'ఇదిగో నయ్యోవ్ పెద్దమణిసీ! - ఆ బేడకాసెట్టి కోమటింటికాడ గొబ్బెరకాయట్టుకురా - కొట్టి సూర్యబగవాన్లకు దణ్ణమెట్టుకుందాం! - అలాటి బక్కోళ్ళను సల్లగా సూడమని' - అంది రత్తి.

* * *